ప్రజాశక్తి

ఆదివారం 1 డిసెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మళ్లీ బాదుడే.. బాదుడు..

- నేటి నుంచి విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు
- కూటమి ప్రభుత్వంలో తొలి విడత పెంపు
- జనవరి ఒకటి నుంచి రెండో విడతకు సన్నాహాలు
- జిల్లాలో 18 లక్షల మంది వినియోగదారులపై భారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలను పెంచబోమని ప్రజాగళం సభల్లో ఊదరగొట్టిన సిఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా సర్దుబాటు పేరుతో ఛార్జీల పెంపునకు పచ్చజెండా ఊపారు. నవంబరునెలలో వినియోగించుకున్న విద్యుత్‌కు డిసెంబరు 2 నుంచి జారీ అయ్యే బిల్లులో మరో విడత ట్రూ అప్ ఛార్జీల పెరుగుదలతో వినియోగదారులకు అందనున్నాయి. యూనిట్‌కు రూ.92 పైసలు చొప్పున డిసెంబరు నెల నుంచి 2026 నవంబరు వరకు రెండేళ్ల పాటు అదనంగా ట్రూఅప్ సర్దుబాటు ఛార్జీలను వసూలు చేయనున్నారు. ఒక్కొ వినియోగదారుడిపై సగటున నెలకు 300 నుంచి రూ.500 వరకు భారం పడనుంది. మరోసారి అదనపు సర్ధబాటు పేరుతో భారం కొనసాగింపును ప్రజలు తప్పుపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7912 కోట్లు వినియోగదారులపై భారం పడనుంది. ఇందులో ఉమ్మడి జిల్లాపై రూ.650 కోట్ల వరకు భారం వేయనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 18 లక్షల మంది వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం మోపనున్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచే ప్రసక్తే లేదని చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలను బేఖాతరు చేస్తూ



ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపనున్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్ని కొనసాగిస్తామని అదనంగా సూపర్ సిక్స్, మరో మేనిఫెస్టో కూడా అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా వైసిపి బాటలోనే అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ఛార్జీల భారం మోపుతున్నారని ఇప్పటికే విమర్శలు పెరుగుతున్నాయి. వైసిపి హయంలో ట్రూ అప్ ఛార్జీలతో పాటు అదనపు సర్దుబాటు ఛార్జీల వసూలును 'బాదుడే బాదుడు' అంటూ ఊరూవాడ అప్పటి ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేసిన కూటమి నాయకులు ఇప్పుడు మళ్లీ వైసిపి బాటలోనే పయనిస్తున్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలకు నష్టాలు వస్తే ప్రభుత్వం భరించడం 2014 వరకు అమలు జరిగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఇందుకు భిన్నంగా నష్టాలను ప్రజలపై వేర్వేరు రూపాల్లో చెల్లించిన బిల్లులకే మళ్లీ వసూలుకు శ్రీకారం చుట్టింది. దాదాపు నాలుగేళ్ల పాటు ఏడు సార్లు ఛార్జీలను పెంచి ప్రజల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేసింది. ఇప్పుడు టిడిపి కూడా అదే బాటలో పయనిస్తోంది. 2014 నుంచి 2019 మధ్య టిడిపి ప్రభుత్వ నిర్వాకం వల్లే తాము అదనపు భారం వేయాల్సి వస్తుందని అప్పటి సిఎం జగన్ చెప్పేవారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వ నిర్వాకం వల్లే ఛార్జీల సర్దుబాటు (పోటు)ను అమలు చేయాల్సి వస్తుందని చెబుతోంది. రెండు ప్రభుత్వాలు ప్రజలపై అదనపు భారం మోపేందుకు ప్రాధాన్యత ఇచ్చాయి. గతంలో బిల్లులు చెల్లించిన వినియోగానికి మళ్లీ బిల్లులు వసూలు చేయడం ఐదేళ్లుగా పరిపాటైంది.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

రూ.643.80 కోట్ల జెడ్పీ బడ్జెట్‌కు ఆమోదం

ప్రారంభమవ్వని పనులను రద్దు చేస్తున్నట్లు ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ 2025-26 ఆర్థిక సంత్సరానికి 643.80 కోట్ల అంచనాతో బడ్జెట్‌కు జెడ్పి స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. శనివారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాయంలో జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన 1వ స్థాయి సంఘ సమావేశంలో నూతన బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఇందులో జెడ్పీతోపాటు, అనుబంధ శాఖలుగా ఉండే పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి శాఖల బడ్జెట్ కలిసి ఉంది. ఇందులో కేవలం జెడ్పీ బడ్జెట్ రూ.71.11 కోట్ల అంచనాతో రూపొందించారు. స్థాయి సంఘాలు ఆమోదించిన ఈ బడ్జెట్ అంచనాలను రాబోయే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమోదం కోసం ప్రవేశడతారు. 7వ స్థాయి సంఘ సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ జెడ్పీ నుండి మంజూరు చేసిన పనులలో గత సంవత్సర కాలంగా ప్రారంభం కాని పనులు రద్దు అయినట్లు చెప్పారు. వాటిలో అవసరం ఉన్న పనులు కొత్త ప్రతిపాదనల కింద చేపట్టి మంజూరు చేస్తామన్నారు. ఆ విధంగా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల్లో మంజూరు చేసి, ప్రారంభం కాని పనుల వివరాలు ఆయా శాఖల అధికారులకు చైర్‌పర్సన్‌కు అందజేశారు. అలాగే కాలంలో చేపట్టబోయే పనులకు సంబంధించి రూ.9.14 కోట్ల

▶ 2లో

సిఆర్‌డిఏ కార్యాలయం డిజైన్‌లపై పోలింగ్ -2లో



సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల గుడిసెలు కూల్చివేత

ప్రజాశక్తి-తాడేపల్లి

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీస్ అధికారులు కలిసి శనివారం కూల్చివేశారు. కార్మికులందరూ దీక్ష శిబిరం నుండి ఇంటికి వెళ్ళిన తర్వాత, వర్షం పడుతున్న సమయంలో సాయంత్రం సుమారు 5.30 గంటలు సమయంలో జెసిబిలతో పేదల గుడిసెలు నిమిషాల వ్యవధిలోనే నేలమట్టం చేశారు. కార్మికులకు విషయం తెలిసి వచ్చేలోపే ప్రభుత్వ అధికారులు ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఎమ్‌టిఎంసి కమిషనర్ ఆలింబాష, తాడేపల్లి తహశీల్దార్ సీతారామయ్య ఆదేశాలతో కూల్చివేతలు జరిగినట్లు కూల్చివేతకు వచ్చిన అధికారులు చెబుతున్నారు. మొన్నటిదాకా అది ప్రైవేటు స్థలమని, దాంతో తమకు సంబంధం లేదని చెప్పిన అధికారులు ఇప్పుడు కూల్చివేతలకు పాల్పడటం వెనుక ప్రభుత్వం హస్తం ఉందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు అనుకూలంగా కోర్టులు తీర్పులివ్వగా వీటి అమలును విస్మరించిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం చట్టాలను ఉల్లంఘించడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. తాము లేని సమయం చూసి ప్రభుత్వం దొంగదెబ్బ తీసిందని కార్మికులు మండిపడుతున్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల విషయంలో మీకు న్యాయం చేస్తానని చెప్పిన మంత్రి నారా లోకేష్ ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేచేస్తున్నారు. ప్రభుత్వం, మంత్రి కార్మికుల పక్షము, ఎన్నారైల పక్షమా? తేల్చుకోవాలన్నారు.

కార్మిక సంఘాలు ఖండన

తమకు న్యాయంగా రావాల్సిన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు సంబంధించిన స్థలంలో వేసుకున్న గుడిసెలను ప్రభుత్వ అధికారులు కూల్చివేయడాన్ని వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్ర ముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి ఖండించారు. కార్మికుల పక్షాన తాము అండగా ఉంటామన్నారు. కూల్చివేతను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎన్‌టియుసి నాయకులు దర్శనపు సామేలు, ఎఐఎఫ్‌టియు నాయకులు కోటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు టి.వెంకటయ్య ఖండించారు. ప్రభుత్వం అధికారులు ఎన్‌ఆర్‌ఐలకు అండగా ఉండటం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ సమస్యపై స్పందించాలని కోరారు.

వరిపై ఫెయింజల్ పంజా

- తుపాను గాలులకు నేలవాలిన కంకులు
- జిల్లా వ్యాప్తంగా వర్షాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలోని ఏర్పడిన పాండిచ్చేరికి సమీపంలోని మహాబలిపురం వద్ద ఫెయింజల్ తుఫాన్ శనివారం సాయంత్రం తీరాన్ని తాకడంతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. తుపాను తీరం దాటడానికి కొన్ని గంటల ముందు శుక్రవారం తెల్లవారుజాము నుంచి వీచిన ఈదురుగాలులకు వరి పైరు నేలవాలింది. వర్షంతో పైరు కొంత తడిసింది. ఉమ్మడి జిల్లాలో 3.25 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. చాలా ప్రాంతాల్లో మరో వారం పది రోజుల్లో కోయడానికి రైతులు సన్నద్ధం అయిన తరుణంలో తుపాను రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తుపాను తీరం దాటడం, జిల్లాలో ప్రభావం తక్కువగా ఉండటం వల్లే నష్టం జరిగేంత వర్షం లేదని అధికారులు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి ఒక జల్లులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురిసింది. డెల్టాలో ఒక మోస్తరునుంచి భారీ వర్షం కురిసింది. డెల్టా ప్రాంతంలో ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. తుపాను తీరం దాటేసమయంలో 60 కిలోమీటర్ల వేగంతో భారీగా గాలులు వీచాయి. దీంతో కోతకు సిద్ధంగా వున్న వరి పైరు నేలవాలింది. మరో వైపు తుపానుతో చలిగాలులు తీవ్రం అయ్యాయి. వర్షం కురుస్తుండటంతో ఇప్పటికే కోసిన వరిపనలకు నష్టం వాటిల్లకుండా రైతులు ఉరుకులు,పరుగులు పెడుతున్నారు. కొంత మంది కుప్పలు వేస్తున్నారు. వర్షం, ఈదురుగాలతో డెల్టా ప్రాంతంలో చలిగాలులు తీవ్రం అయ్యాయి. వృద్దులు, పిల్లలు, నుమోనియా వ్యాధిగ్రస్తులు ఇబ్బంది పడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

7వ తేదీ తర్వాత యడవల్లి భూముల్లో సాగు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యడవల్లి దళితుల భూమి జోలికొస్తే సహించబోమని వ్యవసాయ కార్మి క సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పండరిపురంలోని సిఐటియు కార్యాలయంలో యడవల్లి దళిత, గిరిజన భూపోరాట కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో యడవల్లి భూ బాధిత రైతుల సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి దళిత రైతు శామ్‌సన్ అధ్యక్షత వహించగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యడవల్లిలో ఎస్సీ, ఎస్టీలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను వారి ఆమోదం లేకుండా, గ్రామసభలు నిర్వహించకుండా, మైనింగ్ కోసం బలవంతంగా గత వైసిపి ప్రభుత్వం లాక్కుందని అన్నారు. నష్టపరిహారం కూడా సరిగా ఇవ్వలేదని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సొసైటీ భూముల్లో క్వారియింగ్‌ను నిలిపేయాలన్నారు. సొసైటీ భూమి 416 ఎకరాలు సర్వే చేసి ప్రతి దళిత గిరిజన కుటుంబానికి వ్యక్తిగత పట్టాలు వెంటనే ఇవ్వకుంటే 7వ తేదీ తర్వాత ఆ భూములను సాగు చేస్తామని ప్రకటించారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి విడుదల రజిని ఆ భూములో మైనింగ్‌కు కడప ఎంపీ అవినాష్‌రెడ్డితో కుమ్మక్కయ్యారని, దీనిపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించగా నష్టపరిహారంపై

▶ 2లో



రాయపూడి వద్ద నిర్మిస్తున్న సిఆర్‌డిఎ కార్యాలయం

సిఆర్‌డిఎ కార్యాలయం డిజైన్‌లపై పోలింగ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో రాయపూడి వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయం భవనం ఎలా ఉండాలనే దానిపై అధికారులు వెబ్‌సైట్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను కార్యాలయ నిర్మాణం సైతం ఎలా ఉండాలనే దానిపై 10 ఆకర్షణీయమైన డిజైన్లను రూపొందించి వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రజలు తమకు నచ్చిన డిజైన్ మీద క్లిక్ చేసి ఓటు వేస్తే మెజార్టీ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఓటింగ్ ఈనెల 6వ తేదీ వరకు ఉంటుంది. ప్రజలు https://crda.ap.gov.in/ APCRDAV2/Views/ AdminBuildingPoll.aspx లింకు ద్వారా ఎపిసిఆర్‌డిఎ వెబ్ సైట్‌లోకి వెళ్లి ఓటింగ్‌లో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

అమరావతిలోని రాయపూడిలో సీడ్ యాక్సెస్ రహదారి పక్కన రూ.160 కోట్లతో జి ప్లస్ విధానంలో సిఆర్‌డిఎ కార్యాలయం నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయం విజయవాడలో ఉంది. రాయపూడిలో నిర్మించే కార్యాలయం నిర్మాణం పూర్తయితే సిఆర్‌డిఎ కార్యకలాపాలు అమరావతిలోనే జరుగుతాయి. 2018లో కార్యాలయం నిర్మాణ పనులు ప్రారంభమై వైసిపి అధికారంలోకి వచ్చాక కొంతమేర జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక బిల్డింగ్ డిజైన్‌ను మార్చాలని సంకల్పించింది. సిఎం చంద్రబాబు గత అక్టోబర్‌లో సిఆర్‌డిఎ కార్యాలయానికి పూజలు జరిపి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

రూ.643.80 కోట్ల జెడ్పీ బడ్జెట్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

అంచనాలతో 108 పనులకు ఆమోదం తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో అమలు జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలైన గృహ నిర్మాణం, రోడ్ల నిర్మాణాలు, పల్లె పండుగ పనులు, ఉపాధి హామీ తదితర పనుల గురించి అధికారులు సమావేశాల్లో వివరించారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించి రెండో స్థాయి సంఘం, విద్య, వైద్యంకు సంబంధించి నాలుగో స్థాయి సంఘ సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగాయి. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి 3వ స్థాయి సంఘం సొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన, మహిళా సంక్షేమానికి సంబంధించి 5వ స్థాయి సంఘ సమావేశం పిల్లి ఉమాప్రణతి అధ్యక్షతన, సాంఘిక సంక్షేమానికి సంబంధించి 6వ స్థాయి సంఘం బి.అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాలను జెడ్పీ సిఇఒ జ్యోతిబసు పర్యవేక్షించారు.

7వ తేదీ తర్వాత యడవల్లి భూముల్లో సాగు

(మొదటి పేజీ తరువాయి)

2021లో కోర్టు వివరాలు అడిగినా అధికారులు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ఆరోజు భూములు లాక్కోవటానికి సహాయం చేసిన అప్పటి ఎస్ఐను కూడా సస్పెండ్ చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. అయినా గత ప్రభుత్వం గాని,ఈ ప్రభుత్వం కూడా పేదలకు న్యాయం చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నామని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా పల్నాడు కార్యదర్శి జి.రవిబాబు, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, ఎస్.లూథర్, బాధిత రైతులు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో శనివారం గురజాడ అప్పారావు 109 వర్ధంతి కాలనీ ఐద్వా కమిటీ కార్యదర్శి షేక్.ఖాజాబీ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత కోశాధికారి సుకన్య, ఇతర నాయకులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ గురజాడ అప్పారావు గొప్ప సంఘసంస్కర్త అని, స్త్రీల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి అని, దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని సమాజాన్ని మార్చడంలో కొత్త ఆలోచన రేకెత్తించాడని కొనియాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు, మహిళా విద్య కోసం కృషి చేశాడన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నాయని, మహిళల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్నారు. మహిళలపై అత్యాచారాలు హత్యలు పెరిగిపోతున్నాయని, ఇలాంటివి జరిగినప్పుడు ప్రభుత్వాలు నేరస్తుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలన్నారు కార్యక్రమంలో ఐద్వా నాయకులు నూర్జహాన్, అచ్యుత కుమారి తదితరులు పాల్గొన్నారు

జెకెసి కాలేజీలో గురజాడ వర్ధంతి

స్థానిక జెకెసి కాలేజిలో శనివారం గురజాడ అప్పారావు 109వ వర్ధంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగు-ఆంగ్ల సాహిత్యాల తారతమ్యత, ఆంగ్ల కవుల సాహితీ గమ్యాన్ని మన తెలుగు కవులు కొన్ని ప్రక్రియలను తీసుకొని తెలుగు సాహిత్యాన్ని ముందుకు నడిపించారన్నారు. ఆధునికాంధ్ర కవిత్వానికి మూలపురుషుడిగా తెలుగు ఉన్నంతకాలం ఉంటారని కొనియాడారు. కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ యస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషకు గొప్ప ఖ్యాతిని తీసుకొచ్చిన ఘనుడు గురజాడ అన్నారు. ముఖ్య అతిథి జి.ఎస్.చలం మాట్లాడుతూ గురజాడ సాహిత్యాన్ని విశ్లేషించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదనందిపాడులో నివాళులర్పిస్తున్న మహిళలు, నాయకులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో అప్పారావు చిత్రపటానికి సిఐటియు నాయకులు మర్రి లక్ష్మి, రైతు సంఘం మండల అధ్యక్షులు ముద్దన వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడారు. కె.లక్ష్మి, రాజు, అఖిల, స్వరూపారాణి, షమీరా, హరిత, సురేఖ, వెంకటేశ్వర్లు, లక్ష్మి పాల్గొన్నారు.

పల్నాడు పోలీసులకు క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పోలీస్ వర్క్ అంటే టీమ్ వర్క్అని, ఆ టీం వర్క్ స్పోర్ట్స్ ద్వారా కూడా సాధ్యమవుతుందని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ - గేమ్స్ మీట్ పోటీలు-2024ను ఎస్పీ శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఆటలిస్తాయని, పోలీసులకు ఇటువంటి క్రీడా ఉత్సవం ఎంతో అవసరమని అన్నారు. ఆదివారం వరకూ సాగే స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, టెన్నీస్, షటిల్ మొదలగు క్రీడలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.వి. సంతోష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు, డీఎస్పీ పాల్గొన్నారు.

దాచేపల్లి సిఐగా భాస్కర్ బాధ్యతలు

ప్రజాశక్తి -దాచేపల్లి



దాచేపల్లి సిఐగా భాస్కర్ శనివారం బాధితుల స్వీకరించారు. స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు, సిబ్బంది సహకారంతో విధులు నిర్వహిస్తామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ డీలర్ల నియామక నోటిఫికేషన్ రద్దు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

నరసరావుపేట డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో రేషన్ డీలర్ల నియామకానికి నిర్దేశించిన మార్గదర్శకాలు జి.ఓ.ఎం.ఎస్.నెం 32 మేరకు గత నెల 22న ఇచ్చిన నోటిఫికేషన్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆర్‌డిఓ కె.మధులత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోస్టర్ పాయింట్‌లో నిల్వల వ్యత్యాసం వలన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.

ఫార్మ కోవిజిలెన్స్ రంగంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ లోకేష్ రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఫార్మసీ విద్య ద్వారా ఉజ్వల భవిష్యత్తు త్వరితగతిన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని జీవితంలో త్వరితగతిన ఉన్నత స్థానంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని ఫోర్జియా ఫార్మ కోవిజిలెన్స్ సంస్థ మేనేజర్ డాక్టర్ ఒబినేని లోకేష్‌రెడ్డి అన్నారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలోని ఎఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఫార్మ కోవిజిలెన్స్, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. లోకేష్‌రెడ్డి మాట్లాడుతూఎన్నో బహుళ జాతి సంస్థలు ఫార్మ కోవిజిలెన్సు ద్వారా విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఫార్మ కోవిజిలెన్స్ రంగంలో పెనుమార్పులు చోటు చేసుకోబోతున్న నేపథ్యంలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని చెప్పారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బి-ఫార్మసీ, ఫార్మసీ విద్యార్థులకు ఔషధ తయారీ పరిశ్రమలతో పాటు ఐటి రంగంలో కూడా ఉపాధి అవకాశాలు ఉండగా వాటిలో ఫార్మ కోవిజిలెన్స్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. సదస్సులో నేర్చుకున్న అంశాల ద్వారా టిసిఎస్ వంటి బహుళ జాతి సంస్థలలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ రావు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సమగ్ర శిక్ష కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల కార్యదర్శి డి.దేవానందరెడ్డి

గురుకులంలో రాష్ట్ర అధికారి పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సమగ్ర శిక్ష కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల కార్యదర్శి డి.దేవానందరెడ్డి ఎంఇఒ ఎ.శ్రీనివాసరావుతో కలిసి శనివారం తనిఖీ చేశారు. 6వ తరగతి విద్యార్థులకు డిక్టేషన్ పరీక్ష నిర్వహించి, వారి ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ నైపుణ్యాలను పరీక్షించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం నుండి 'భారత దేశ జనాభా పరిమాణం, విస్తరణ' పాఠం గంటసేపు చదవాలని చెప్పి అనంతరం పరీక్ష పెట్టారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్లిప్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు. పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థినులతో కలసి భోజనం చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలి

చెన్నుపాటి ఇండో అమెరికన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి సురేష్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెన్నుపాటి ఇండో అమెరికన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి సురేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకొని నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నాలుగు రోజుల నుండి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి చెన్నుపాటి సత్యనారాయణ శనివారం తెలిపారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ మురళీకృష్ణ సూచన మేరకు ఆదివారం తమ కళాశాల విద్యార్థులతో నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని కొత్త రఘురామయ్య - పాలడుగు నాగయ్య చౌదరి కళాశాల వద్ద నుండి గడియార స్తంభం సెంటర్ వరకు తిరిగి మళ్లీ అదే కళాశాల వరకు ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి సురేష్ మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం ఆరోగ్యకరమైన సమాజం అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు 'హక్కుల బాట పట్టండి' అనే అంశం పై పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ చాటిన బి.మణికంఠ, డి.సుధాకర్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ కె.రమేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవన శైలిలో మార్పులతోనే ఎలర్జీలకు అడ్డుకట్ట

ఎన్నారై వేదికగా ప్రారంభమైన జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో మార్పులను చేసుకోవడం ద్వారానే అలర్జీలకు అడ్డుకట్ట వేయవచ్చునని పలువురు వైద్యులు పేర్కొన్నారు. మండలంలోని చిన్నకాకాని ఎన్నారై మెడికల్ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. సదస్సు లో వివిధ రాష్ట్రాల నుండి ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు, అలర్జీలలో నిష్ణాతులు హాజరై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సదస్సు సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ నేటి కాలంలో మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా అనేక రుగ్మతలు పెరుగుతున్నాయని అందులో అలర్జీలు అధికంగా వ్యాపిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో అలర్జీల సమస్య తీవ్రంగా పెరుగుతూ వస్తున్నదని అందుకు తాజా ఉదాహరణలే కారణమని పేర్కొన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు వాతావరణ కాలుష్యంతో పాటు కార్బన్ సంబంధిత కాలుష్యాలు కార్బనేతర కాలుష్యాలు మనిషి పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. కొన్ని సందర్భాలలో చికిత్సకు కూడా అందని విధంగా అలర్జీలు పెరుగుతున్నాయన్నారు. ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతుందని చెప్పారు. నూతన పరిశోధనలు ఆవిష్కరణల దిశగా సాగుతున్న అంశాలపై ఈ సదస్సులో పలువురు వైద్యులు వారి ఆలోచనలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లలో జంక్ ఫుడ్ ల ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ఎన్నారై అకాడమీ లో ఇటువంటి సదస్సు జరగడం సంతోషకరమన్నారు. ఎలర్జీ



నూతన పోకడలపై చర్చించాల్సిన ఆవశ్యకత నేడు ఎంతో ఉందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్రమణ్య శాస్త్రి, డాక్టర్ శనక్కాయల రాధా మాధవి, సదస్సు కన్వీనర్ డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగే ఈ సదస్సు కు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి సుమారు 350 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారని చెప్పారు. ఈ రెండు రోజులు పాటు జరిగే సదస్సులో వివిధ అలర్జీలో నూతన పోకడలు పై చర్చించడం జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నూతన చికిత్స విధానాలపై పలు సూచనలు జరగనున్నాయన్నారు. సదస్సు కు జాతీయ పిల్లల ఎలర్జీ చాప్టర్ అధ్యక్షులు డాక్టర్ కష్ణమోహన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధణేష్ వాల్వేకర్ , డాక్టర్ కె మురళీధర్ రెడ్డి, డాక్టర్ పి అనిల్ కుమార్, డాక్టర్ వి రఘురాంరెడ్డి, డాక్టర్ వై. సంధ్య, కృష్ణ గుంటూరు జిల్లాల పిల్లల వైద్యులు హాజరయ్యారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామ పరిధిలోని కొత్తపాలెం వేణుగోపాలస్వామి గుడి సమీపంలో బకింగ్ హోమ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. షుమారు 40 సంవత్సరాల వయస్సు ఉన్న పురుష మృత దేహం ఆచూకి తెలిసిన యడల మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించవలసినదిగా మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు.తన ఫోన్ నంబర్ 8688831363 కు తెలియజేయాలన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండల పరిధిలోని చావుపాడు గ్రామం కొండ పరిసరా ప్రాంతంలో గుర్తు తెలియని మృత దేహం స్థానికంగా కలకలం రేపింది. వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, గొర్రెల కాపర్లు గమనించి దగ్గరకు వెళ్లి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలిసిన పోలీసుల కేసు దర్యాప్తు చేపట్టారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - ఈపూరు : ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లాపల్లి మండలం మేళ్లవాగు గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం తనిఖీలు చేశారు. గ్రామానికి చెందిన వెంకట్రావు అక్రమ మద్యం వ్యాపారం చేస్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్దనుండి పది సుమో క్లాసిక్ విస్కీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం నాటు సారాయి అనుమానిత ప్రాంతాలలో సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.

రిషితేశ్వరికి దక్కని న్యాయం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - ఎఎన్‌యు : రిషితేశ్వరికి న్యాయం దక్కలేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకురాలు కే నమిత మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2015 జూలై 14న ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరి వేసుకొని చనిపోయిందన్నారు. చనిపోయే ముందు సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు తనని సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని, ర్యాగింగ్‌అని వివరంగా సూసైడ్ నోట్ రాసి చనిపోయిందన్నారు. ఈ కేసులో ముగ్గురు విద్యార్థులను అప్పటి ఆర్కిటెక్చర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాబురావుని నిందితులుగా రిషితేశ్వరి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. గత తొమ్మిది సంవత్సరాల నుండి కేసు నడుస్తుంది. న్యాయస్థానం ఈ కేసు కొట్టి వేయటం బాధాకరం. ర్యాగింగ్ వేధింపుల నుండి తట్టుకోలేక చనిపోయిన విద్యార్థికి న్యాయం చేయకుండా ఇటువంటి తీర్పులు న్యాయస్థానాలు ఇవ్వటం చాలా ఆశ్చర్యమని తక్షణమే రిషితేశ్వరి కేసులో



నిందితులను శిక్షించాలని ప్రభుత్వం పైకోర్టుకి అప్పీలుచేయాలని ఎస్‌ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామని నమిత తెలిపారు. కార్యక్రమ ంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎం కిరణ్, కే రూపస్ పాల్గొన్నారు.

గుంటూరు తూర్పులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇళ్లకు వెళ్లి పింఛను అందజేసిన ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

గత ఐదేళ్లలో ఛిద్రమైన రోడ్లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహర్దశ తీసుకొస్తున్నామని, గుంటూరులో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని నెహ్రూనగర్ 2వ లైన్ నుంచి 4వ లైన్ వరకు రూ.74 లక్షలతో సీసీ రోడ్డు, 7వ లైనులో రూ.7.50 లక్షలతో సీసీ డ్రెయిన్, వల్లూరి వారితోట 6వ లైన్‌లో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఆధ్వర్యంలో గుంటూరులోని ఆర్ఒబిల నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంజీవయ్యనగర్, సీతానగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి డిపిఆర్‌లు సిద్ధమయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. డ్రెయిన్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ ముప్ప రపు భారతి, చిట్టా బత్తిన చిట్టిబాబు, మహంకాళి నరసింహారావు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ.. : నియోజకవర్గంలోని పలు వార్డులలో శనివారం సామాజిక పింఛన్లు ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నసీర్ స్వయంగా లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజిల, అధికారులు పాల్గొన్నారు.

ఆశాలను పింఛను పంపిణీ నుండి మినహాయించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆశా వర్కర్లను సామాజిక పెన్షన్ పంపిణీ బాధ్యత నుండి మినహాయించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు శనివారం స్థానిక పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు టి.ధనలక్ష్మి అధ్యక్షతన యూనియన్ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు అవుతున్నా ఆశా వర్కర్ల సమస్య ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదని, అదనపు పని భారం మోపారన్నారు. అంతే కాకుండా గతంలో ఉన్న సౌకర్యాలు కూడా రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 9న రాష్ట్ర అధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన హామీ ప్రకారం జీవోలు విడుదల చేయాల్సి ఉండగా, వాటిని పక్కనపెట్టి అనేక సంవత్స రాలుగా వితంతు పింఛను పొందు తున్న ఆశా వర్కర్లకు పెన్షన్ రద్దు చేసు_న్నారని తెలిపారు. దీనివల్ల వారి కుటుంబాలు ఆర్థిక సమస్యలకు గురవు తున్నాయని అన్నారు. ఇప్పటికే ఆశాలతో తమ జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని పనులు చేస్తున్నారని, ఇప్పుడు సామాజిక పింఛన్ల బాధ్యత కూడా అప్పగించటం సరికాదన్నారు. గతంలో ప్రభుత్వం అంగీక రించిన విధంగా ఆశా వర్కర్ల రిటైర్మెంట్ వయో పరిమితి 62 ఏళ్లకు పెంపుదల, రిటైర్ అయ్యే వారికి సర్వీసు పరిహారానికి సంబంధించిన జీఒలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి ధనలక్ష్మి, జిల్లా కోశాధికారి కె.జ్యోతి, జిల్లా నాయకులు జయప్రద, టాన్యా ప్రసంగించారు.



మాట్లాడుతున్న లక్ష్మి

నూరుశాతం ఇంటింటి చెత్త సేకరణకు చర్యలు

పుష్‌కాట్ వాహనాలు ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణకు, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నగరంలో ఇంటింటి చెత్త సేకరణ కోసం సిద్ధం చేసిన పుష్ కాట్స్, డంపర్ బిన్లు, ఈ-ఆటోలను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి, నసీర్ అహ్మద్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు. నగరంలోని 2.80 లక్షల ఇళ్ల నుండి 8 వందల మైక్రో పాకెట్స్ ద్వారా నూరు శాతం చెత్త సేకరణకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారని, అందులో భాగంగా శనివారం 100 పుష్‌కాట్స్, 8 వందలు బిన్లను, 30 పెద్ద కాంపాక్టర్ బిన్లను సిద్ధం చేయించారని, త్వరలో 19 ట్రాక్టర్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కూడా జిఎంసి ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. డిశంబర్ 10 నాటికి నగరంలో వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ క్లీన్, గ్రీన్, హెల్తీ గుంటూరు సాధనకు గత 5 నెలల కాలంలో అధికారులు, ప్రజల సహకారంతో కృషి చేస్తున్నామని తెలిపారు. నగరంలో చెత్త సేకరణ, డ్రైన్లలో పూడిక, ఖాళీ స్థలాల సమస్యలు అధికంగా ఉన్నాయని, దశల వారీగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గతంలో చెత్త సేకరణ కోసం జిఎంసికి కేటాయించిన ఈ-ఆటోలను సక్రమంగా నిర్వహణ చేయలేదన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో మెరుగైన సేవలు అందేలా అధికారులు పని చేయాలని, వారికి ప్రజా ప్రతినిధుల నుండి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజిలా, అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.



పుష్‌కాట్ వాహనాలు ప్రారంభిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, కమిషనర్

28, 29 తేదీల్లో పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించాల్సిన పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగను ఎస్ఎ-1 పరీక్షల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్. రాజగోపాల్‌రెడ్డి (ఆక్స్‌ఫర్డ్ రాజారెడ్డి), కట్టా కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుపై నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌను హాలులో పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పిఎంఇజిపి అధికారులు, ఆర్డీఓ మధులత, ఎల్‌డిఎం రామ్‌ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ బాలు నాయక్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ పలు అంశాలపై మాట్లాడారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. మహిళలు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు.



ఖోఖో రాష్ట్ర జట్టుకు కారంపూడి జెడ్‌పి విద్యార్థులు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - కారంపూడి : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 23, 24, 25 వరకు స్థానిక బ్రహ్మనాయుడు జెడ్‌పి పాఠశాలలో జరిగిన అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్లు హెచ్‌ఎం అనంత శివ శనివారం తెలిపారు. ఎంపికైన వారిలో ఎం. కేశవ, (8వ తరగతి), డి. అఖిల్ (8వ తరగతి), ఎస్.వర ప్రసాద్ (7 తరగతి), బి.జాన్ జీవన్ (8వ తరగతి), వి.సాయి నాయక్ (8వ తరగతి), వై.హర్షిత (8వ తరగతి) ఉన్నారు. ఎం.కేశవ, డి.అఖిల్ ఉత్తమ ప్రతిభ చూపి గుంటూరు జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర జట్టుకూ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి స్వర్ణ రాజు, పాఠశాల మరో పీడీ శ్రీనివాసరావు, ఎస్‌ఎంసి చైర్మన్ బాలునాయక్, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు మోదిన్సా అభినందించారు.

తండాల్లో సిసి రోడ్లకు నిధులు

ప్రజాశక్తి - పెదకూరపాడు : నియోజకవర్గంలో ఎస్టీ తండాల్లో సిసి రోడ్లకు రూ.1.20 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం తెలిపారు. అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతి మండలాల్లో ఎస్టీలు నివసిస్తున్న 6 ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. అచ్చంపేట మండలంలోని శ్రీనివాసరావు తండా, తాడువాయి తండా, నీలేశ్వరపాలెం, క్రోసూరు మండలం పెరికపాడుతండా, పెదకూరపాడు మండలం 75 తాళ్లూరులోని ఎస్టీల నివాసం ప్రాంతం, అమరావతిలో ఎస్టీల నివాస ప్రాంతాలకు రూ.20 లక్షల చొప్పున కేటాయించామనితెలిపారు.

రాచగావుతో ప్రారంభమైన పల్నాటి వీరారాధన ఉత్సవాలు

ప్రజాశక్తి - కారంపూడి



900 ఏళ్లకు పైగా ప్రతిఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలు రాచగావుతో శనివారంప్రారంభమయ్యాయి. ఐదురోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో చరిత్రను పరిశీలిస్తే...

మినీ మహాభారతంగా పిలవబడే అలనాటి పలనాటి యుద్ధం సుమారు 1178 నుండి 1182 వరకు జరిగినట్లు చరిత్ర చెబుతోంది. 11వ శతాబ్ధంలో చోళులు మధ్యప్రదేశ్ నుండి వచ్చి ఇక్కడ వేలనాడు అనే సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ వేళనాడును అనుగురాజు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. నేటి పలనాడు కూడా ఆనాటి వేళనాడులోనే ఉంది. అనుగురాజుకు తెలుగు రానందున దొడ్డ నాయుడును మంత్రిగా నియమించుకొని రాజ్యాన్ని పరిపాలిస్తుండేవారు. దొడ్డ నాయుడు కుమారుడే బ్రహ్మనాయుడు. అణుగురాజుకు ముగ్గురు భార్యలని ఈయనకు సంతానం లేనందున దొడ్డ నాయుడు కుమారుడైన బ్రహ్మనాయుడుని దత్తత తీసుకున్నాడని, కొన్నేళ్లకు అనుగురాజు కూడా సంతానం కలిగినట్లు చరిత్ర. నాటి పల్నాటి రాజ్యంలో మాచర్ల,గురజాల, కారంపూడి ప్రాంతాలుండేవి. అనుగురాజు కుమారులైన నలగామరాజు, మలిదేవరాజు రాజ్యపాలనలో బ్రహ్మనాయుడు మంత్రిగా ఉండేవాడు. అదే సమయంలో మరో మంత్రిగా నాగమ్మను కూడా నియమించారు. నాగమ్మ మంత్రి అయిన నాటి నుండి రాజ కుటుంబంలో మనస్పర్ధలు ఏర్పడి రెండు రాజ్యాలుగా విడిపోయినట్టు చరిత్ర చెబుతోంది. గురజాల రాజ్యాన్ని నల్లగామరాజు పరిపాలిస్తుండగా ఈ రాజ్యానికి మంత్రిగా నాయకురాలు నాగమ్మ, మాచర్ల రాజ్యాన్ని మలిదేవరాజు పరిపాలిస్తుండగా ఈ రాజ్యానికి బ్రహ్మనాయుడు మంత్రిగా ఉండేవారు. నిత్యం ద్వేషాలతో రగిలిపోయే దాయాదులు కయ్యానికి కాలుదువ్వుకునేవారు.

బ్రహ్మనాయుడు ఆనాడే కుల వివక్షతను వ్యతిరేకించాడు. నేటికీ చాపకుడుగా పిలవబడే సహపంక్తి భోజనాన్ని మనుషులందరు సమానమని బ్రహ్మనాయుడు ఆనాడే ఏర్పాటు చేశాడు. దళితుడైన కన్నమదాసును సైన్యాధ్యక్షుడుగా నియమించాడు. మని దేవరాజు రాజ్యాన్ని కూడా ఎలాగైనా సేజిక్కించుకోవాలని నాయకురాలు నాగమ్మ కోడిపందాల పెట్టాలని పురికొల్పింది. కోడిపందాలలో ఓడిపోయిన వారు ఏడేళ్ల రాజ్యాన్ని వదిలి వెళ్లాలని షరతుతో దయాదులు కోడిపందాలకు దిగారు. కోడిపందాలకు నాడు నాయకురాలు నాగమ్మ పన్నిన పన్నాగం వలన బ్రహ్మనాయుడు కోడి ఓడిపోవడంతో మలిదేవరాజు, బ్రహ్మనాయుడు రాజ్యాన్ని వదిలేసి అడవి బాట పట్టారు. ఏడేళ్ల అరణ్యవాసం పూర్తి చేసుకున్న తరువాత రాజ్యాన్ని మాకు అప్పగించాలని మలిదేవరాజు దగ్గర బంధువైన అలరాజును రాయబారానికి పంపడంతో అలరాజును నాయకురాలు నాగమ్మ చంపిస్తుంది. దీంతో యుద్ధం తలెత్తినట్లు చరిత్ర చెబుతుంది.

జీవనదిగా పిలవబడే నాగులేరు పక్కనగల నేడు వీర్ల దేవాలయంగా పిలవబడే వీర్ల గుడి ఆవరణలో నాలుగేళ్లపాటు సాగిన పలనాటి యుద్ధంలో అనేకమంది మరణించారు. బ్రహ్మనాయుడు బంధువులు 66 మంది కూడా యుద్ధంలో మరణించడంతో బ్రహ్మనాయుడు వైరాగ్యం చెంది గుత్తికొండ బిలానికి వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. ఈ 66 మందికి గుర్తుగా 66 శివ లింగాలను వీర్ల దేవాలయంలో ప్రతిష్టించారని చెబుతుంటారు. నాయకురాలు నాగమ్మ కూడా యుద్ధం అనంతరం వైరాగ్యంతో తపోవనంకు వెళ్ళినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది.

నాడు జరిగిన పరిణామామంతటిని ప్రపంచానికి తెలియజేయాలని యుద్ధం జరిగిన ప్రదేశంలోనే బ్రహ్మనాయుడు వీరాచరపీఠం ఏర్పాటు చేసి ఆ పీఠానికి పిడుగు వంశస్తులను అధ్యక్షులుగా నియమించాడు. నాడు యుద్ధంలో జరిగిన ప్రతి ఘట్టాన్ని మహోత్సవాల రూపంలో నేటికీ ఆచరిస్తూ ఉన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా యుద్ధం చేసిన యుద్ధ వీరులను స్మరించుకుంటూ యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలను పూజిస్తూ ప్రతిష్టాత్మకంగా పల్నాటి వీరుల ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ప్రపంచంలో యుద్ధ వీరులను స్మరించుకుంటూ రోమ్ నగరం, కారంపూడిలో మాత్రమే పలనాటి ప్రాంతంలో కార్తీక మాసం చివరలో అమావాస్య రోజున ప్రారంభమయ్యే ఉత్సవాలు ఐదు రోజులపాటు నిర్వహిస్తుంటారు. రాచగావు, రాయబారం, మందపోరు,కోడిపోరు, కల్లిపాడు ఇలా ఐదు రోజులు పాటు ఐదు రోజుల విశిష్టతను తెలియజేస్తూ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆంధ్ర రాష్ట్రంలో 14 రాష్ట్రాల్లో ఉన్న వీరాచారవంతులకు ఆహ్వానం పంపారు. ఇప్పటికే పోతురాజుకు నూట ఒక్క పోగులతో ఆనకట్ట కట్టి ఉత్సవ ప్రక్రియను శనివారం మొదలుపెట్టారు. కారంపూడిలో నాడు రాజులు నిర్మించిన కోట బురుజు, శంకుతీర్ధ మండపం, కన్నమనీయుడు మేడ, నామ తీర్థ మండపం, వీర్ల అంకాలమ్మ దేవాలయం, వీర్ల గుడి ఆవరణలో కాలభైరవ దేవాలయం, కళ్లిపోతురాజు మండపం, అంకాలమ్మ ముగ్గు, బ్రహ్మనాయుడు పులి జూదం నేటికీ చెరిగిపోని వారి ఆనివాళ్లుగా ఉండటం విశేషం.

ఎండ్ల పందేలు, క్రికెట్ పోటీలు ప్రారంభం

పల్నాటి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎడ్ల పందెలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం ప్రారంభించారు. వీరు తొలుత అంకళమ్మ, చెన్నకేశవ దేవాలయంలో ప్రత్యేక పూజలు, అనంతరం వీర్ల దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం గురుకుల పాఠశాల ఆవరణలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కారంపూడి సర్పంచ్ సరస్వతిభాయి బాలునాయక్, టిడిపి మండల అధ్యక్షులు యు.లక్ష్మీనారాయణ, నాయకులు పి.పుల్లయ్య, పి.అంజయ్య, పి.రాఘవ, కె.బాలకృష్ణ, రాము, సురేష్ యాదవ్, నాగేశ్వరరావు, శ్రీను, మాజీ ఎంపిపి నాగుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు వద్దు : సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు భారం ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని, వ్యవసాయ పంప్ సెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని సిపిఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక పుతుంబాక భవన్లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలను వెంటనే రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేయాలన్నారు. గతేడాది పంటలు నష్టపోయిన రైతులకుకు బీమా పరిహార వెంటనే చెల్లించాలని, సమగ్ర ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించాలని కోరారు. వ్యవసాయ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని గతంలో నారా లోకేష్ చెప్పడంతోపాటు దగ్గరుండి ఆయనే పగలగొట్టారని నేడు అదే స్మార్ట్ మీటర్లను బిగించడానికి అనుమతించారని విమర్శించారు. 2015లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ బాబురావు సీనియర్ల వేధింపులు వల్ల ఆత్మహత్య లేఖ రాసి చనిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనత కాలంలోనే ఆ కేసును కొట్టివేయడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. ఈ సంఘటనలో బాధ్యులైన వారిని కూటమి ప్రభుత్వం రక్షిస్తుందని అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నరసింహారావు, బి.రామారావు, జె.భగత్, బి.శివయ్య, ఆర్.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్

అదును చూసి అధిక రేటు..!

ప్రజాశక్తి- రెంటచింతల

రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోచుకుంటున్నారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలియడంతో వరి కోయడానికి రైతులు సిద్ధమయ్యారు. యంత్రాల నిర్వాహకులు ఇదే అదునుగా భావించి ధరలు పెంచేశారు. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల నుంచి యంత్రాల నిర్వహకులుకు బ్రోకర్లే ఆధారం. మొన్నటిదాకా ఎకరాకు రూ.2800 తీసుకునేవారు ఇప్పుడు రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. నిన్నటి మొన్నటి వరకు రూ.100 కమీషన్ తీసుకునే బ్రోకర్లు ఇప్పుడు రూ.300 వసూలు చేస్తున్నారు.





మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు

చిలకలూరిపేటలోనే తక్కువ అవినీతి

తపాలా కార్యాలయానికి శంకుస్థాపనలో కేంద్ర సహాయ మంత్రి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దేశంలోని అవినీతి అతి తక్కువగా ఉన్న ప్రభుత్వ శాఖ చిలకలూరిపేట తపాలాశాఖేనని కేంద్రం కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో రూ.2.3 కోట్లతో తపాలా కార్యాలయానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవీటికోట అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనను రాజకీయాల్లోకి తెచ్చింది పత్తిపాటి పుల్లారావేనని చెప్పారు. ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ ఇటీవల కడప జిల్లా గండికోట అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించిన విధంగానే, కొండవీడు కోటకు కూడా నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇందకు మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో మధులత, చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఏపీ సర్కిల్ ప్రకాష్ పాల్గొన్నారు.

మరణంలోనూ ప్రజల కోసమే...

ప్రజానాట్య మండలి నేత గాదె సుబ్బారెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం

సిపిఎం, ప్రజాసంఘాల నివాళి - వైద్య పరిశోధనల కోసం ఎన్నారై వైద్యశాలకు భౌతికకాయం



గాదె సుబ్బారెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉండవల్లికి చెందిన గాదే సుబ్బారెడ్డి (78 శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. యధావిధిగా ఉదయాన్నే కృష్ణానదిలో ఈతకు వెళ్లా రు. నదిలోని ఉన్నట్టుండి గుండెపోటు రావడంతో సహచర ఈతగాళ్లు వెంటనే ఒడ్డుకు చేర్చి, దగ్గర్లో ఉన్న మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆయన చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఉదయాన్నే ఈ వార్త విన్న కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, ప్రజానాట్యమండలి కళాకారులు, విజ్ఞాన కేంద్రాల బాధ్యులు ఆశ్చర్యానికి లోనయ్యారు. మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి మధు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి మంగరాజు, ఎస్ అనిల్ కుమార్ సుబ్బారెడ్డి భౌతికకాయంపై ప్రజానాట్యమండలి జెండాను కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్య పరీక్షల కోసం ఎన్నారైకి భౌతికకాయం తరలింపు

శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందిన ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి మృతదేహాన్ని మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రికి వైద్య పరిశోధనల కోసం కుటుంబ సభ్యులు అప్పగించారు. కళ్ళను హైదరాబాదులోని ఎల్వీఆర్ కంటి ఆసుపత్రికి అందించారు.

ఘన నివాళి: ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్ అధ్యక్షతన సాయంత్రం జరిగిన సంతాప సభలో చివరి శ్వాస వరకు సమాజ శ్రేయస్సుకోసం పాటుపడిన ధన్యజీవి గా దే సుబ్బారెడ్డి అని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (విజయవాడ) చైర్మన్ పి మధు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ కళారూపాలను తీర్చిదిద్దటంలో సుబ్బారెడ్డి కొత్త వరవడి సృష్టించారని చెప్పారు. సాధారణమైన పేద ప్రజలకు అర్థమయ్యే రీతిలో కళారూపాలు తయారు చేయడంలో ఆయన దిట్టని కొనియాడారు. ఇటీవల తెలుగు రాష్ట్రంలో ప్రజాకవి సుద్దాల హనుమంతు పేరుతో రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర వారసత్వాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజా పక్షం వహించే సిద్ధాంతం కోసం ప్రజల పక్షాన నికరంగా నిలబడి పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సుబ్బారెడ్డి మృతి మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం, ప్రజానాట్యమండలి, బాలోత్సవ కార్యక్రమాలకు తీరని లోటని తెలిపారు. తన జీవించిన కాలంలో ఎలా జీవించారు అనేది కొలబద్దని, దాన్ని ఆచరణలో చేసి చూపించిన ప్రజా కళాకారుడు అని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు అందరితో కలిసిపోయే స్వభావం ఆయన వెన్నంటే వచ్చిందని



మాట్లాడుతున్న వైవి



మాట్లాడుతున పిన్నమనేని


తెలిపారు. పార్టీ ఆదేశానుసారం ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ అవసరం ఉంది పని చేయమంటే అక్కడ పని చేశారని కొనియాడారు. ప్రజా కళలను ఊరువాడ ప్రజల ముంగిట చేర్చడానికి, వీధినాటికల ద్వారా ప్రజల్ని చైతన్య పరిచారని చెప్పారు. భార్య శివలీలతో పాటు కుటుంబ సభ్యులందరినీ పార్టీ వైపు నిలబెట్టారని కొనియాడారు. కళారంగం ఆయన మరో గుండెకాయగా భావించారని చెప్పారు. ఎంబీ వికె కార్యదర్శి పి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా ఉద్యమంలో 55 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం తామదని గుర్తు చేసుకున్నారు. కరోనా సమయంలో కూడా విద్యార్థులకు ఆన్లైన్లో పోటీలు నిర్వహించడం ఆయన దర్శినికతకు నిదర్శనమని చెప్పారు.

పలువురు సంతాపం


శనివారం ఉదయం గుండెపోటుతో మతి చెందిన ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదే సుబ్బారెడ్డి మతికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వందలాది మంది తరలివచ్చి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని మిత్రుడికి కడసారి వీడ్కోలు పలికారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, వై వెంకటేశ్వరరావు, డి రమాదేవి, బి తులసీదాస్, ఎంబీబీకే ట్రస్ట్ చైర్మన్ పి మధు, ఎంబీబీకే కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, ఎస్ ఎస్ చంగయ్య, ఈమని అప్పారావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు, నిడుమోలు మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి కాశీనాథ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, డప్పుకళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రాంతి కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న, సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, గుడివాడ సిపిఎం నాయకులు ఎన్ మురళీకృష్ణా రెడ్డి, ప్రజానాట్యమండలి కృష్ణ, గుంటూరు నాయకులు అప్పన్న, పి ప్రసాద్, దేవరకొండ శీను, పద్మ, కుసుమ, కోటేశ్వరి, రాష్ట్ర సాంస్కృతిక రంగం బాధ్యులు కే స్వరూపరాణి, యు వి రామరాజు, డి వి ఎస్ రాజు, జి నారాయణ, పి విజయ, వై సుబ్బారావు, సిపిఎం గన్నవరం డివిజన్ కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ప్రజాశక్తి సిజిఎం వై అచ్యుతరావు, జిఎం హరి కిషోర్, నాయకులు నిర్మల, పి నరసింహారావు, అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్ రామరాజు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ముజఫర్ అహ్మద్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి బాలకృష్ణ, టిడిపి నాయకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, జంగాల సాంబశివరావు, విశ్రాంత సైనిక ఉద్యోగి గోపాలం సాంబశివరావు, ప్రజానాట్యమండలి తెలంగాణ నాయకులు దేవేంద్ర, కవి, ఎస్.కె కాసిం, తాడేపల్లి, ఉండవల్లి సిపిఎం నాయకులు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ కుమారి, బూరుగు వెంకటేశ్వర్లు, కొట్టే కేకరుణాకర్ రావు, వేముల దుర్గారావు, టి భక్తి రెడ్డి, ఎస్ ఇమాన్యుల్ రాజు, ఆర్వి రాఘవయ్య, కే ఈశ్వర్ రెడ్డి, ఎస్ వెంకట్రావు, పి గిరిజ వివిధప్రజా సంఘాల నాయకులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.



మాట్లాడుతున్న పి మధు



నివాళులర్పిస్తున్న పాశం రామారావు తదితరులు



నివాళులర్పిస్తున్న డి రమాదేవి తదితరులు





మాట్లాడుతున్న ఎం రవి

13 మందితో సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ

కార్యదర్శిగా ఎం.రవి ఎన్నిక

ప్రజాశక్తి - తుళ్లూరు

సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శిగా ఎం రవి తిరిగి ఎన్నికయ్యారు. సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ సభ్యులుగా ఎం భాగ్యరాజు, జె.నవీన్ ప్రకాష్, కె వెంకటేశ్వర్లు కుంభా ఆంజనేయులు, చేవూరి నందాజీ,జి చెంచయ్య, పేరం బాబురావు,ఎస్ రామరాజు,టి బక్కిరెడ్డి,ఎస్ ఇమ్మానియేల్, రాజు, ఎర్రమనేని శ్రీనివాసరావు, ఎస్ కె గని ఎన్నికయ్యారు. శనివారం తుళ్లూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఎం రవి కమిటీ ఎన్నిక, మహాసభలో చేసిన తీర్మానాలను వివరించారు. రాజధాని అభివృద్ధి పనులలో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని, రాజధాని అభివృద్ధికి నిధులను కేంద్ర ప్రభుత్వమే గ్రాంటుగా ఇవ్వాలని, రాజధానిలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, రాజధాని రైతులకు, అసైన్డ్ రైతులకు పెండింగ్ వార్షిక కౌలు చెల్లించాలని, సీడ్ యాక్సిస్ రోడ్డు రైతులకు న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, అసెంబ్లీ, హైకోర్టు కార్మికులను ఆప్కాసు లోకి తీసుకొని వారి జీతాలు పెంచాలని, కార్మికులకు నిలిపివేసిన సామాజిక పెన్షన్ పున రుద్ధరించాలని, రాజధాని యూనివర్సిటీలలో రాజధాని విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని, టిడ్కో గృహాల బ్యాంకు రుణాలను రద్దుచేసి మౌలిక వసతులు కల్పించాలని, రెండో విడత టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టాలని, రాజధాని పేదలకు, కూలీలకు ఉపాధి కల్పించాలని, అన్న క్యాంటీన్లను రాజధాని లోని అన్ని గ్రామాలలో ప్రారంభించాలని, రాజధాని గ్రామాలలో అంతర్ రోడ్లు, డ్రైనేజీలను మెరుగుపరచాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో మౌలిక వసతులు, రాజధానిలో ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మించి ఉపాధి కల్పించాలని కోరుతూ మహాసభలో పలు తీర్మానాలు చేయడం జరిగిందని రవి తెలిపారు.



అన్నమయ్యకు వెయ్యిమంది కళాకారుల గళార్చన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో శనివారం సాయంత్రం నిర్వహించిన అన్నమయ్య సహస్ర గళార్చన వీనుల విందుగా సాగింది. తానా, దర్శనం టీవీ ఛానల్ , సిటీ కేబుల్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సహస్ర గళార్చన కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తానా అధ్యక్షుడు శంగవరపు నిరంజన్, ఎన్ఆర్ఐ కోలా అశోక్ బాబు, సిటీ కేబుల్ యండి దండమూడి కృష్ణమోహన్, బ్రహ్మశ్రీ జయశంకర్ శిష్ట తదితరులు పాల్గొన్నారు. వెయ్యి మంది గాయనీ గాయకులతో అన్నమయ్యకు గళాన్ని ఆలపించారు. . కార్తీక మాసంలో చివరి రోజైన శనివారంను పురస్కరించుకుని గళార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయం సంధ్య వేళ అన్నమయ్య సంకీర్తనలతో సమ్మోహనంగా సహస్ర గళార్చన కొనసాగింది. ప్రేక్షకులు మైమరచి పోయే విధంగా సహస్ర గళార్చన సాగిందని కేంద్ర మంత్రి పెమ్మసాని వ్యాఖ్యానించారు. నేటి తరం యువత సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు దగ్గర కావాలని పిలుపునిచ్చారు. సిటీ కేబుల్ యండి దండమూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ కేవలం ఆంధ్రప్రదేశ్ నుండే కాక తెలంగాణా నుంచి కూడా గాయనీ గాయకులు వచ్చారని తెలిపారు. చిన్నారుల్లో మరింత స్ఫూర్తిని నింపేందుకు ప్రతిఏటా సహస్ర గళార్చన లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలుచేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని, లేనిచో ఆందోళనకు పూనుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు చెప్పారు. శనివారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విస్తృత సమావేశం నాయకులు కాపు వెంకట సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోని వచ్చాక నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ వంటగ్యాస్ ధరలు పెరిగిపోయాయన్నారు. మరోవైపు నిరుద్యోగం, పేదలకు ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారని సమస్యలు పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వంకూడా బిజెపి విధానాలు అనుసరిస్తుందన్నారు. ఎన్నికలముందు తాము అధికారం లోకి వస్తే ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెడతామని, మద్యాన్ని అదుపు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యాన్ని



మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, తేమ శాతం ఎక్కువగా ఉన్నదనే కారణం తో 75 కేజీల బస్తా రూ.1740 ఉండగా కేవలం రూ.1300 రూ.లకు ప్రైవేటు ఎా ్య పా ా ల ం కొనుగోలు చేస్తున్నారని, రైతులు వర్షం భయంతో తక్కువ రేటుకు అమ్ముకుంటున్నారని , ప్రభుత్వం స్పందించి రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని , ప్రత్తిని కూడా సి.సి.ఐ.కేంద్రాల ద్వారా మద్ధతు ధరకు కొనుగోలు చేయాలని అన్నారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు, బి. లక్ష్మణరావు తదితరులు ప్రసంగించారు.



పాఠశాలల్లో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాఠ్యాంశాల బోధనను లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు పల్నాడు జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్ చంద్రకళ సూచించారు. నరసరావుపేట మండలంలోని యలమంద, బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు, బండ్లమోటు జిల్లా పరిషత్ పాఠశాలలను, బొల్లాపల్లి కెజిబివిని డిఇఒ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి చేతిరాత మెరుగుపరచాలని చెప్పారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు.



గురజాడ అప్పారావుకు విద్యార్థుల నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సందర్భంగా స్థానిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురజాడ చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు మాట్లాడారు.

మద్దిరాల గంగాధర్‌కు ఎంపీ సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ - డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మద్దిరాల గంగాధర్‌ను ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు తన పార్లమెంట్ కార్యాలయంలో శనివారం సత్కరించారు. బీసీల అభ్యున్నతి, సంక్షేమం, సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉందని అన్నారు.



రోటరాక్ట్ ఆఫ్ కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు అవార్డుల పంట

బెస్ట్ కాలేజ్, బెస్ట్ ప్రజెంటేషన్, బెస్ట్ మెంబర్షిప్ డెవలప్మెంట్ అవార్డుల కైవసం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు బెస్ట్ కాలేజ్, బెస్ట్ ప్రజెంటేషన్, బెస్ట్ మెంబర్షిప్ డెవలప్మెంట్ అవార్డులను కైవసం చేకుందని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. నరసరావుపేట ఎంఎఎం కాలేజీలో సంఘమమ్ గ్రూప్-4, గ్రూప్-5 మీట్ నరసరావుపేట రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఫీనిక్స్ నిర్వహించగా అందులో తమ కాలేజీకి అవార్డులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన అభినందన సభలో క్లబ్ కో-ఆర్డినేటర్ ఎం.బాలకోటేశ్వరరావు, ప్రెసిడెంట్ రత్నావళి, సెక్రటరీ డి.హర్షిత పాల్గొన్నారు.

తాగునీటి క్యాన్ ధరలను పెంచవద్దు

- పట్టణానికి ఉపయోగపడని కెసిపి వారి విగ్రహాలు ఎందుకు
- మాచర్ల కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు

ప్రజాశక్తి - మాచర్ల

మున్సిపాలిటీ తరపున అనేక ఖర్చులు చేస్తున్నామని, పేదలకు అందించే వాటర్ క్యాన్ ధర రూ 2ను పెంచకపోవటం మంచిదని కౌన్సిలర్ షేక్ సుభాని కోరారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాల్‌లో కౌన్సిల్ సమావేశం చైర్మన్ పోలూరి నరసింహరావు అధ్యక్షతన జరిగింది. సుభాని మాట్లాడుతూ తాగునీరు క్యాన్ ధరను రూ.2 నుండి రూ.5కు పెంచటాన్ని వ్యతిరేకించారు. కౌన్సిలర్ గట్ల అరుణకుమారి మాట్లాడుతూ కెసిపి వారు మాచర్ల టౌన్‌కు చేసిన మేలు ఏమి లేదని, అటువంటి వారి విగ్రహాలను పట్టణంలో ఎందుకు అనుమతివ్వాలని నిలదీశారు. కౌన్సిల్ ఎజెండాలో రింగ్ రోడ్డు కూడలిలో కెసిపి సంస్థల ఫౌండర్ వెలగపూడి రామక్రిష్ణ విగ్రహం ఏర్పాటుపై చర్చ జరిగింది. సుభాని మాట్లాడుతూ ఆయన విగ్రహం బదులుగా నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి నాగిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. విగ్రహాల ఏర్పాటు వలన ముఖ్యమైన కూడళ్ళలో పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురు అవుతున్నట్లు పలువురు వివరించారు. చివరికి ఎన్‌టిఆర్, వెలగపూటి రామక్రిష్ణ, మాజీ ఎంఎల్‌ఎ జూలకంటి నాగిరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పోలూరి నరసింహారావు

2003 నుండి ఇప్పటి వరకు కూరగాయాల మార్కెట్ షాపుల అద్దె మొత్తం కేవలం రూ.800 ఉందని, దీనిని రూ.4వేలకు పెంచటం సరికాదని కౌన్సిలర్ శ్రీనివాసరావు అభ్యంతరం తెలిపారు. ఇందుకు స్పందించిన కౌన్సిలర్ సుభాని మాట్లాడుతూ మార్కెట్ సెంటర్ అత్యంత విలువైన ప్రాంతమని, అక్కడ నిర్ణయించిన రూ 4.వేలు అద్దె సరిగానే ఉన్నట్లు వివరించారు. మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీటి పరీక్షకు రూ.3.30 లక్షలతో ల్యాబ్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కెసిపి వెనుక వైపు నుండి రైల్వే స్టేషన్ రహదారి గుండా ఇందిరాగాంధి బొమ్మ వరకు కాల్వల్లో పూడిక తొలగింపుకు రూ.5 లక్షలు, పట్టణంలోని ఇతర మేజరు కాలువల్లో పూడిక తొలగింపుకు రూ.2.77 లక్షలు, లైట్లు, వాటి పనిముట్లకు రూ.2.50 లక్షల ఖర్చుకు, రూ.3.50 లక్షలతో ట్రాక్టర్ల మరమ్మతులకు, డంపింగ్ యార్డులో చెత్తను లెవల్ చేసేందుకు, యార్డుకు రాకపోకలు సాగించే రహదారి మరమ్మతులకు రూ.4.50 లక్షలు వ్యయానికి కౌన్సిల్ ఆమోదించింది. సున్నం బ్లీచింగ్ కొనుగోలుకు రూ.2 లక్షల కేటాయింపుకు, నూతన పుష్‌కార్టులు కొనుగోలుకు, ఉన్న వాటి మరమ్మత్‌లకు, వీల్ బార్స్ మరమ్మతులకు, పారలు కొనుగోలుకు రూ.2 లక్షలు వ్యయం చేసేందుకు, దంతెలు, సలకపారలు, పలుగులు కొనుగోలుకు రూ.2 లక్షలు వ్యయం చేసేందుకు, 12 కాంపాక్టర్ బిన్స్ కొనుగోలుకు రూ.4.70 లక్షలు వ్యయం చేసేందుకు కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ వేణుబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల స్వరూపం మార్పులపై సమగ్ర విచారణ

చిలకలూరిపేట కౌన్సిల్ సమావేశంలో టిడిపి డిమాండ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రతిరోజూ తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ సాధారణ సమావేశం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్మన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. వైసిపి కౌన్సిలర్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ మురుగు గణపవరానికి రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డులో మంత్రి ఇంటి నిర్మాణం కోసం డ్రెయిన్ల స్వరూపాన్నే మార్చివేశారని, పలు కాలనీలలో ముంపు సమస్య ఏర్పడిందని టిడిపి పక్ష నాయకులు గంగా శ్రీనివాసరావు చెప్పారు. దీనిపై పూర్తి విచారణ చేసి బాధ్యులైన అధికారుల మీదా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిల్ సమావేశాలకు హాజరుకాని కౌన్సిలర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆక్రమణల తొలగింపులో అలసత్వం పనికిరాదన్నారు. నరసరావుపేట సెంటర్, ఎస్‌బిఐ కార్యాలయం కాంప్లెక్స్ వద్ద సర్వీసు రోడ్లపై ఆక్రమణలు పెరిగాయని చెప్పారు. ప్రమాదాలకు కారణమవుతున్న ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. 10వ వార్డు కౌన్సిలర్







బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ అక్రమ కుళాయిలను క్రమబద్ధీకరించాలని, బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నా స్పందన కరువైందన్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. వైసిపి కౌన్సిలర్ వడితే కోట్యానాయక్ మాట్లాడుతూ నరసరావుపేట రోడ్డులో డివైడర్లు ప్రారంభమయ్యే ప్రాంతంలో, టిడిపి కార్యాలయం వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, తన కుమారుడ్ని సైతం రోడ్డు ప్రమాదం రూపంలో కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వీటిపై మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు వివరణిచ్చారు. గణపవరం వద్ద కాల్వ నిర్మాణానికి రూ.25 కోట్లతో అంచనాలు తయారు చేసి పంపామన్నారు. తాను విధుల్లో చేరిన తర్వాత 633 నిర్మాణాలపై పన్నులు వేశామని, రూ.48 లక్షలు వసూలు చేశామని చెప్పారు. అక్రమ కుళాయిల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుమారు రూ.10 కోట్లు ఆస్తి, నీటి కుళాల పన్నులు వసూలుకు ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. బస్‌షెల్టర్ల నిర్మాణానికి కొంతమందితో చర్చించామని, త్వరలోనే పనులు చేపడగామని అన్నారు. ఇటీవల తమకు కేటాయించిన ఎమ్మెల్సీ ఎన్నికలు, ఇతర సర్వేల వల్ల ఆక్రమణల తొలగింపు జాప్యమైందన్నారు. అనధికార ఫెక్సీలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించామన్నారు. టిడ్కో గృహాల వద్ద పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించనున్నట్లు చెప్పారు.

అదాని అరెస్టు కోసం కాంగ్రెస్ ర్యాలీ



ప్రజాశక్తి - పెదకూరపాడు

దేశాన్ని బిజెపి ప్రభుత్వం తాకట్టు పెడుతోందని జాతీయ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మమతా నాగిరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక షాదీఖానాలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా గోపి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మమత మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం రుణమాఫీలు చేస్తోందని, ఆదానీకి విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే ఆస్తులను ఇస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించొద్దన్నారు. సోలార్ పవర్‌లో అవకతవకల వ్యవహారంలో ఆదానినీ అరెస్టు చేయాలన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రామారావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ దాచారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగుల హామీని నెరవేర్చాలన్నారు. గంటా గోపి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. తొలుత గ్రామ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదానిని అరెస్టు, మోడీ విధానాలను వ్యతిరేకించే పోస్టులను ఆవిష్కరించారు. యూత్ కాంగ్రెస్ జోనల్ ఇన్‌ఛార్జి టి.సందీప్, జిల్లా ఇన్‌ఛార్జి పి.ప్రసాదు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు ఉదయ శంకర్, భవాని వెంకటేష్, అద్బుల్ రహీం పాల్గొన్నారు.

అంగలూరు చేపల చెరువుకు 3న వేలం

ప్రజాశక్తి-ఈపూరు

మండంలోని అంగలూరు చేపల చెరువు బహిరంగ వేలం మంగళవారం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి మనోహర్ శనివారం తెలిపారు. 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించి ధర రూ.3.36 లక్షలుగా ఉందన్నారు. వేలంలో చేపల చెరువును దక్కించుకున్న వారు ఒకే వాయిదా పద్ధతిలో సొమ్ము మొత్తాన్ని చెల్లించాలన్నారు. ధరలో 1/4 వ వంతు రూ.84 వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నరసరావుపేటలో నేడు యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

హాజరకానున్నఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, డిఇఒ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ పోరాడుతోందని, పాలకపక్షాలను నిలదీస్తుందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి అన్నారు. నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ మహాసభలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మహాసభల సందర్భంగా జాతీయ పతాకాన్ని యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.నాగేంద్రుడు, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి ఎం. నాగయ్య, యుటిఎఫ్ పతాకాన్ని యుటిఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి ఎస్.కె గాలీబ్ సాహెబ్ ఆవిష్కరిస్తారన్నారు. సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు కె.ఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డిఇఒ ఎల్.చంద్రకళ హాజరవుతారన్నారు. ప్రధాన వక్తలుగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్, గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు వ్యవహరిస్తారన్నారు.

వాస్తవాలకు ప్రతిబింబంగా ఫొటోగ్రఫీ నిలవాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహనరావు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఫొటోగ్రఫీ రంగం ఎంతో అభిలాషతో కూడుకున్నదని అభిలాషకు తగినట్లుగా వాస్తవాలను ప్రతిబింబించేలా ఫోటోలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఇన్చార్జి చైర్మన్ ఆచార్య కె .రామ్మోహన్ రావు అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగాలు సంయుక్తంగా 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవం శనివారం నిర్వహించారు. జర్నలిజం విభాగం ఇన్చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జయ గోవింద బాబు అధ్యక్షతన కార్యక్రమంలో రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ రంగం వయసుకు సంబంధం లేకుండా ఆసక్తి పెరుగుతుందన్నారు. ఫోటోల ద్వారా గతాన్ని భవిష్యత్తును తెలుసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత అందిపుచ్చుకొని తదనగుణంగా నూతన పద్ధతుల్లో ఫొటోగ్రఫీ రావడం చూస్తున్నమన్నారు. ఆలోచనత్మక దృష్టితో ఫోటోలను తీయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం. సురేష్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఫొటోగ్రఫీకి సంబంధించి కూడా కోర్సులు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి పి ఎస్.పాల్ కుమార్, ఫొటోగ్రఫీ అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలవ్యాప్తంగా ఫొటోగ్రఫీలో నైపుణ్యాల ప్రదర్శించిన 25 మందికి బహుమతులు అందజేశారు.



ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పురపాలికలో సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని తెనాలి మున్సిపల్ చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక అన్నారు. శనివారం అమరావతి ఫ్లాట్స్ 30వ వార్డులో పారిశుధ్య పనుల పరిశీలనకు వచ్చిన ఆమెకు వార్డు కౌన్సిలర్ కె జయపాల్ ప్రజా సమస్యలను వివరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో మ్యాన్ హోల్స్‌ను పరిశుభ్రం చేయించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పట్టణ సమస్యలపై వస్తున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని మున్సిపల్ పారిశుధ్య అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమీషనరు విఎన్ లక్ష్మీపతి, అసిస్టెంట్ ఇంజనీరు సునీల్ కుమార్, ఎంహెచ్ఒ కె హెలెన్ నిర్మల, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



నెహ్రూ నికేతన్‌లో 'టెక్‌బుక్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యార్థుల్లో ఐక్యూ పెంపొందించే విధంగా పాఠ్య పుస్తకాలను రూపొందించాలని నెహ్రూ నికేతన్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి వి మురళి కాంత్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని కాకతీయ కోపరేటివ్ సొసైటీ డిఎల్ కాంతారావు వేదికపై శనివారం జరిగిన 'టెక్ బుక్' పుస్తక ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన టీచర్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతో అగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి అత్యాధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ పుస్తకాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ పాఠశాలలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లీడ్ స్కూల్ సీఈవో సుమిత్ మెహతా ఢిల్లీ నుంచి జూమ్ కాల్ ద్వారా సమావేశమై మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడిన కొద్ది పాఠశాలల్లో మాత్రమే ఈ పుస్తకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్న నెహ్రూనికేతన్ లో వచ్చే సంవత్సరం పాఠ్యపుస్తకాలను ప్రవేశ పెడతామన్నారు. జోనల్ అకాడమిక్ డైరెక్టర్ లోలక్ మాట్లాడుతూ ఒకప్పుడు పుస్తకాల్లో పొందుపరచిన పాఠ్యాంశాలను విద్యార్థులు చదివి నేర్చుకున్నారని, ప్రస్తుతం పుస్తకాలే విద్యార్థులతో మాట్లాడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ సీనియర్ అకాడమిక్ అడ్వైజర్ వివి సుధాకర్ ఆపరేషన్ మేనేజర్ డి శివారెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛను నగదు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పేరిట పెన్షన్ నగదు పంపిణీ శనివారం మంగళగిరి , టిప్పర్ల బజార్‌లో తెల్లవారుజాము నుండే నిర్వహించారు. కమిషనర్ అలీం భాష, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో కలిసి పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఫించనుదారుల ఇళ్లకు వెళ్లి నగదును స్వయంగా అందజేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు పెన్షన్ నగదును అందుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాలతో ఆరోగ్యకర జీవనం

రైతు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, అరికెలతో తయారు చేసిన ఆహారంతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని గుంటూరు రైతు ఫౌండేషన్ చైర్మన్ మరియు పద్మశ్రీ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు శనివారం కొర్నేపాడులోని రైతు నేస్తం ఫౌండేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కొనసాగుతున్న సేంద్రియ వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వివరించారు. అనంతరం విద్యార్థులు సేంద్రియ పద్ధతులతో సాగవుతున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. దేశవ్యాప్తంగా చిరుధాన్యాలపై విద్యార్థులు రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రఖ్యాత శాస్త్రవేత్త మిల్లెట్ రాంబాబు విద్యార్థులతో ముచ్చటించారు. చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వందన స్వామి రైతు ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు మిల్లెట్ రాంబాబులను సత్కరించి జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రైతు ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాంబశివరావు, ఎస్ ఆర్ యూనివర్సిటీ మీడియా మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



4న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-మంగళగిరి: నిలిచిపోయిన ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, జి.ఒ.యం.యస్.నెం 114 ను విడు దల చేయాలని అసోసియేషన్ అధ్యక్షులు బి ఎస్ ఆర్ శర్మ , బిజె గాంధీ శనివారం మంగళగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరు క్రమబద్ధీకరణ చేశారుగాని, కాంట్రాక్టు లెక్చరర్లు మాత్రమే క్రమబద్ధీకరణ చేయలేదన్నారు. ప్రభుత్వం అధికారులకు అనేక సార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేదన్నారు. విధిలేని పరిస్థితుల్లో డిసెంబర్ 4వ తేదీన విజయవాడలోసత్యాగ్రహదీక్షకు పిలుపు నిచ్చామన్నారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించని పక్షంలో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. గవర్నమెంట్ కాలేజీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బి ఎస్ ఆర్ శర్మ, ప్రధాన కార్యదర్శి బి జే గాంధీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



జాబ్ మేళా వివరాలను వెల్లడిస్తున్న కాలేజీ డైరెక్టర్ పి రాజశేఖర్

వీజే డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతినగర్ లోని వీజె డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన, సీడాప్ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా జరిగింది. 10 కంపెనీలు పాల్గొన్న జాబ్‌మేళాలో 192 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 86 మంది వివిధ కంపెనీలలో రూ.13 నుండి 30వేల వరకు వేతనాలతో ఉపాధి పొందారని విజె డిగ్రీ కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్, ప్రెగడ రాజశేఖర్, జేఈవో కె.రమాదేవి, వైపీ ఇ.హారిక సౌగంధి, డీఎస్ డీవో కె.సంజీవరావు, డీపీవో పి.ఈశ్వర్ వివరాలు తెలిపారు. ఉద్యోగార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ డిగ్రీ పూర్తయ్యాక ఒకటి రెండేళ్లు ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతీయువకులు ఏ కంపెనీలో చేరాలన్నా సాధారణంగా ఉద్యోగ అనుభవం అడుగుతారని వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఇటువంటి జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారు వేతనాలు గురించి ఆలోచించకుండా చేరినట్టయితే అనుభవం వస్తుందని, తద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. వరుణ్ మోటార్స్, టాటా క్యాపిటల్ లిమిటెడ్, శ్రీరామ్ మ్యాన్ పవర్ ఎంజీటీ సర్వీసెస్ (ఎస్సార్ ల్యాబ్ ప్రై.లి.), ఆన్ ఈఎంఐ టెక్నాలజీ సొల్యూషన్స్, ఎపెక్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్, కేఎల్ గ్రూపు అమెజాన్ వేర్ హౌస్, కాన్విజీనియస్, రామచంద్ర బ్రదర్స్ ఫర్నిచర్స్, రుద్ర కార్పొరేట్ సర్వీసెస్ వంటి కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. జాబ్ మేళాకు వీజే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశలవారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కార్యదర్శులను ఆదేశించారు. శనివారం కమిషనర్ ఏటి అగ్రహారం, శ్రీరామ్‌నగర్ మెయిన్‌రోడ్, కెవిపి కాలనీ, సాయినగర్, ఏసుభక్తనగర్, చుట్టగుంట సెంటర్, రామనామ క్షేత్రం రోడ్, సంపత్ నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను, ఎస్వీఎన్ కాలనీలో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటి కంట్రోల్ సిబ్బంది రికార్డ్ చేయాలన్నారు. చుట్టగుంట వాకింగ్‌ట్రాక్ చుట్టూ లైట్లు, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని, ట్రాక్ పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఏఈని ఆదేశించారు. సంపత్ నగర్ శివారులో వ్యర్థాలు కుప్పలుగా వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ మధుసూదన్, ఏసిపి రెహ్మాన్, టిపిఎస్ పాల్గొన్నారు.

నేడు సిపిఎం మంగళగిరి పట్టణ మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఎం మంగళగిరి పట్టణ మహాసభ డిసెంబర్ ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరుగుతుందని సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్ శనివారం తెలిపారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఈమని అప్పారావు, ఎస్ ఎస్ చెంగయ్య, ఎం రవి, తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.



వర్సిటీ వికాస కార్యవర్గం ఏకగ్రీవం

ఒక ప్యానల్ మాత్రమే నామినేషన్ దాఖలు

ఎన్నికల అధికారి ఆచార్య ఎస్. మురళీమోహన్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఈ మేరకు ఎన్నికల అధికారి ఆచార్య ఎస్ .మురళీమోహన్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైన వికాస ఫలితాలను వెల్లడించారు. అధ్యక్షునిగా నీలపు ప్రసాద్, ఉపాధ్యక్షులుగా దాసరి విజయ ప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా తోట వెంకటేష్, నేలపాటి నాగేశ్వరరావు, కోశాధికారిగా కొలికపూడి యేషయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చిమట ఆనంద్ కుమార్, పి. నాగరాజు, సిహెచ్. సాంబశివరావు, కేతావత్ శశిధర్, జి. శ్రీను, నల్లగుర్ల శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరెడ్డి, టంకశాల వెంకటేశ్వరరావు, నూతక్కి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నవంబర్ 27న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా 27,28 తేదీలలో నామినేషన్లకు అవకాశం కల్పించారు. 27వ తేదీ ఫ్రెండ్స్ ఫైనల్ పేరుతో నీలపు ప్రసాద్ ప్యానల్ నామినేషన్లు వేసింది. ఆపై మరెవరు నామినేషన్ వేయకపోవడంతో శనివారం మధ్యాహ్నం వరకు నామినేషన్లు ఉపసంహరణ అవకాశం ఉండటంతో ఎన్నికల అధికారి నామినేషన్ల ఉపసంహరణ సమయం ముగిసిన వెంటనే నామినేషన్ వేసిన సభ్యుల దరఖాస్తులను పరిశీలించి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

బాల్యవివాహాలను అరికట్టాలి : సిడిపిఒ

ప్రజాశక్తి - పెదనందిపాడు

బాల్యవివాహాలను అరికట్టాలని సిడిపిఒ వి సుజాతదేవి తెలిపారు. శనివారం 'బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ ' కార్యక్రమంలో భాగంగా పెదనందిపాడు బిసి కాలనీ అంగన్వాడి సెంటర్లో సెక్టార్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిడిపిఒ సిహెచ్ విజయనిర్మల, సెక్టార్ సూపర్వైజర్ వై రాజ్యలక్ష్మి అంగన్వాడీ టీచర్స్, సిబ్బంది చేత బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ లక్ష్మీ ఫౌండేషన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి వైద్యులు తగు సూచనలు చేశారు. మొత్తం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు నాగభవానీ, లక్ష్మీ ఫౌండేషన్ సిబ్బంది రజియ, గురవయ్య, ఇమ్రాన్, అశోక్ పాల్గొన్నారు.



నూతన కార్డులే ప్రామాణికం : కమిషనర్

వీధివ్యాపారుల గుర్తింపు కార్డు దరఖాస్తుకు 5 వరకు గడువు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులకు దరఖాస్తుల స్వీకరణకు డిసెంబర్ 5వ తేదీతో గడువు ముగుస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఇచ్చే కార్డులే ప్రామాణికమని, కావున నగరంలోని ప్రతి వీధి వ్యాపారి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీధి వ్యాపారులు పాత గుర్తింపు కార్డులు ఉన్నందున, కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేయట్లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. నూతనంగా కేటాయించే కార్డుల ఆధారంగా వెండింగ్ జోన్లలో స్థల కేటాయింపు జరుగుతుందన్నారు. పాత గుర్తింపు కార్డులు ఉన్న వారు కూడా నూతన గుర్తింపు కార్డు కోసం విధిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతోపాటు అందరూ వ్యక్తిగత ఫోటో (వ్యాపారం చేయుచున్న పాస్ పోర్ట్ ఫోటో), కుటుంబ సభ్యుల ఫోటో (14 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే), డిక్లరేషన్ పత్రం, నివాసధృవీకరణ పత్రం, గతంలో స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డు నకలు, ఆధార్ కార్డు, అర్జీదారుని ఫోన్ నెంబర్, బ్యాంకు అకౌంట్ నకలు జత చేయాలన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ తదితరులు

321మంది ఆర్‌విఆర్ అండ్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

టిసిఎస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో రూ.9 లక్షలు, రూ.7 లక్షలు, రూ.3.5 లక్షల భారీ ప్యాకేజితో 321 మంది తమ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దిని తెలిపారు. శనివారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా, నిత్యం మారుతున్న టెక్నాలజీని విద్యార్థులకు అందించటం ద్వారా బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు పొందగలుగుతున్నారని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్ వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

క్రీడా పోటీల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు ఫార్మసీ కాలేజి విద్యార్థులు పల్నాడు జిల్లా నర్సరావుపేటలోని నిప్స్ ఫార్మసీ కాలేజిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో పాల్గొని చాంపియన్‌గా నిలిచారన్నారు. ఈ పోటీల్లో వాలీబాల్‌లో ప్రథమ బహుమతి, ఉమెన్ రన్నింగ్‌లో ప్రథమ బహుమతి, ఉమెన్ కబడ్డీలో ద్వితీయ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ, త్రోబాల్‌లో ప్రథమ బహుమతి సాధించారని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్స్‌తోపాటు, నగదు బహుమతులు కూడా అందజేశారు. విజేతలను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ అభినందించారు.

చలపతి ప్రిన్సిపల్ రామారావుకు సీనియర్ సైంటిస్ట్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు



ప్రొఫెసర్ రామారావును అభినందిస్తున్న వై.వి.ఆంజనేయులు, తదితరులు

ఉపాధ్యాయ వృత్తిలో మూడు దశాబ్దాలకుపైగా నేటి యువతలోని నైపుణ్యాలను వెలికితీస్తూ, ఫార్మా విద్యారంగంలో, పరిశోధనా రంగంలో తలమానికంగా నిలుస్తూ ఉత్తమ ప్రతిభ చాటినందుకుగాను చలపతి పార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావుకు అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఫార్మసీ వారు 'సీనియర్ సైంటిస్ట్ అవార్డు'కు ఎంపిక చేసినట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు తెలిపారు. డిసెంబర్ 19-21వ తేదీన ఉత్తరప్రదేశ్ మాంగల్యాదాన్ యూనివర్సిటీలో నిర్వహించే 18వ వార్షికోత్సవ సమావేశంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ రామారావు ఫార్మసీ విద్య, పరిశోధనా రంగంలో 32 సంవత్సరాలకుపైగా అనుభవం కలిగి 200కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించి 7 పుస్తకాలను రచించారని, 3 పేటెంట్లను సొంతం చేసుకున్నారన్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా నియమితులై నాణ్యమైన ఫార్మసీ విద్య కోసం ఎన్నో నూతన ఆవిష్కరణలు చేసి అందరి మన్ననలు పొందారన్నారు. పరిశోధనకు పెద్దపీట వేస్తూ 32 మంది డాక్టోరల్‌కు మార్గనిర్దేశం చేశారని, వందకుపైగా సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆయన చేసిన కృషికి ప్రొఫెసర్ ఎం.ఎల్. ఖోరానా మెమోరియల్ అవార్డు, స్కోర్ మోర్ ఫౌండేషన్ వారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, హార్ట్‌ఫుల్ ప్రొఫెసర్ అవార్డు సన్‌ఫ్యూర్ రీసెర్చ్ అవార్డు, ఎపిటిఐ ప్రత్యేక ప్రశంస పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా వై.వి.ఆంజనేయులు, కళాశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఆశావాహులు అధికం-పదవులు స్వల్పం

వీక్షణం

టిడిపి కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు కావాలని అనేక మంది పోటీ పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోస్టుల్లో జిల్లాకు కేటాయింపులు తక్కువగానే ఉంటున్నాయి. అయినా ఇప్పటికే రెండు విడతలు జిల్లాలోని అనేక మందికి నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టారు. అయినా ఇంకా అనేక మంది నాయకులు తమకు పదవులు దక్కలేదని అసంతృప్తిగా ఉన్నారు. సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ఇస్తారని భావించిన చీఫ్ విప్ పదవి చివరికి వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులుకు దక్కింది. సీనియర్ ఎమ్మెల్యేలు తమకు మంత్రి పదవులు దక్కలేదని అసంతృప్తితో ఉండగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం దక్కని వారు కనీసం రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవి యినా దక్కుతుందని భావించారు. కూటమి లోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఇంకా అనేక మంది పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. మూడు పార్టీల్లో సీనియర్‌లతో పాటు కొత్తగా వచ్చిన అనేక మంది నాయకులు కూడా రాష్ట్ర స్థాయి పదవి ఆశిస్తున్నారు. అయితే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. నాయకుల స్థాయి బట్టి పోస్టులు కేటాయిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా ప్రకటించిన జాబితాల్లో ఈ జాగ్రత్తలు తీసుకున్నారు. గతంలో కార్పొరేషన్ చైర్మన్ పదవి చేసిన వారికి ఈసారి డైరెక్టర్ పోస్టు ఇచ్చి సరిపెడుతున్నారు. అలాగే ఎంపి, లేదా ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశించిన వారికి కూడా కార్పొరేషన్‌లో డైరెక్టరు పదవి ఇచ్చి సర్దుకోమ ంటున్నారు. నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న వారికి ఇంత వరకు గ్యారంటీ లేకుండా పోయింది. మొదటి జాబితాలో ముగ్గురికి అవకాశం ఇచ్చారు. పద్మశాలియ సంఘం కార్పొరేషన్ నందం అబద్దయ్య, లిడ్ క్యాపు చైర్మన్‌గా పిల్లి మాణిక్యారావు అవకాశం కల్పించారు. మాజీ మంత్రి అలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు కృష్ణా, గుంటూరు జిల్లాల పట్ట భద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేశారు. తరువాత గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన ఇద్దరు నాయకులకు టిటిడి మెంబర్లుగా నియమించారు. మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకి దేవి, గురజాలకు చెందిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి తిరుమల, తిరుపతి దేవస్థానం బోర్డులో సభ్యులుగా నియమించారు. అయితే ఎమ్మెల్సీగా ఉండగానే వైసిపి నుంచి టిడిపిలో చేరిన జంగాకృష్ణమూర్తి మరో సారి ఎమ్మెల్సీ కావాలని ఆశిస్తున్నారు. వచ్చే మార్చిలో ఎమ్మెల్సీ పదవులకు రానున్న ఖాళీల్లో తనకు ఛాన్సు వస్తుందని జంగా కృష్ణమూర్తి ఆశి స్తున్నారు. గత ఎన్నికల్లో తెనాలి నుంచి పోటీ చేసే అవకాశం లేకపోవడంతో రాజేంద్ర ప్రసాద్‌కు ఎట్టకేలకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. రెండో విడత ఖరారు చేసిన జాబితాలో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మందికి అవకాశం కల్పించారు. ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డేగల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి మాదిగ వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించారు. గుంటూరు పశ్చిమకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు మన్నవ మోహన్ కృష్ణకు కూడా టెక్నాలజీ సర్వీసెస్ డెవలప‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించారు. జనసేన నాయకుడు చిలకలపూడి పాపారావుకు అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పదవి దక్కింది. రెంటచింతల టిడిపి నాయకురాలు మంజులా రెడ్డికి ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ చైర్‌పర్సన్ పదవి దక్కింది. రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ నరసరావు పేటకు చెందిన గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మంగళగిరికి చెందిన జనసేన పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా సలగల రాజశేఖర్ బాబు అవకాశం ఇచ్చారు. ఇప్పటి వరకు దాదాపు 12 మందికి నామినేటెడ్ పోస్టులు దక్కాయి. ఇంకా అనేక మంది పదవులు ఆశిస్తున్నారు. టిడిపి నాయకులు కొమ్మాలపాటి శ్రీధర్, కోవెలమూడి రవీంద్ర, మక్కెన మల్లిఖార్జునరావు, కుర్రా అప్పారావు, పత్తిపాడు నియోజకవర్గం నాయకులు గుంటుపల్లి వెంకటేశ్వరావు, ముత్తినేని రాజేష్, మద్దిరాల మ్యానీ, తాళ్ల వెంకటేష్ యాదవ్, భీమినేని వందనాదేవి, యూత్ నాయకులు నాగమల్లేశ్వరరావు(మల్లి), ఉయ్యూరు శ్రీనివాస్, సిరివరపు శ్రీధర్, బుచ్చిరాం ప్రసాద్, తాడిశెట్టి మురళీ రావిపాటి సాయికృష్ణ,వీరితో పాటు జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, పాకలపాటి రమాదేవి, నాయబ్ కమల్, బిజెపి నాయకులు పాతూరి నాగభూషణం, వల్లూరు జయప్రకాష్ నామినేటెడ్ పోస్టులు ఆశిస్తు న్నారు. వీరితో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మార్కెట్ యార్డులు, ఇతర ఆలయాల కమిటీ చైర్మన్ పదవులపై పలువురు నేతలు దృష్టి సారించారు. ఆశించే వారి సంఖ్య ఎక్కువగా ఉందని, పదవులు తక్కువగా ఉన్నాయని సీనియర్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. **(ఎ.వి.డి.శర్మ)**

ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపునకు కృషి చేయాలి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరు


ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచే విధంగా కృషి చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మేయర్ కావటి మనోహర్‌నాయుడిని కోరారు. ఈ మేరకు శనివారం కె.యస్.లక్ష్మణరావు, మనోహర్ నాయుడికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను విభజించి పాలించు అనే విధంగా వ్యవహరించి ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచకుండా మోసం చేసిందని అన్నారు. అతి తక్కువ జీతాలతో ప్రమాదకరమైన పనులు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు కూడా ఉన్నారని, ప్రమాదకరమైన పనులు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులను గుర్తించి వారికి వేతనాలు పెంచాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు అనుబంధం మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపుదల కోసం వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు నరసింహారావు, వై ప్రభుదాసు, షేక్ అలీమ్, షేక్ రసూల్, టి.రాంబాబు, కె.మరియదాసు పాల్గొన్నారు.

అప్ సైక్లింగ్‌తో ఆర్థిక వ్యవస్థకు ఊతం

ప్రజాశక్తి-గుంటూరు

అప్‌సైక్లింగ్ సహాయంతో ప్లాస్టిక్‌ను క్రియేటివ్‌గా మార్చి అధిక విలువ కలిగిన వస్తువులుగా తయారు చేయడం వలన పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తుందని ఐఐఎస్‌సీ బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ సూర్యసారథిబోస్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెర్బ్ ఇండియా ఏఎన్‌ఆర్‌ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్‌సీఎఫ్‌పీఎస్‌టీ-2024)' అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ప్రొఫెసర్ సూర్యసారథిబోస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ వలన ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించి సమీప ప్రదేశాలను శుభ్రంగా ఉంచే అవకాశం ఉందన్నారు. కొత్త ప్లాస్టిక్ ఉత్పత్తి కోసం అవసరమయ్యే ముడిసరుకు అవసరం కూడా తగ్గుతుందన్నారు. అంతేకాకుండా ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రక్రియ వలన గాలి కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. విట్రిమర్ల సహాయంతో సముద్ర జలాన్ని తాగునీటిగా మార్చవచ్చునన్నారు. ఈ మెటీరియల్స్ భవిష్యత్తులో పర్యావరణ హితంగా ఉండటంతోపాటు కాలుష్య నివారణలో కీలకం కానున్నాయని వెల్లడించారు. సదస్సులో పూణెలోని హెచ్‌ఈఎంఆర్‌ఎల్ డీఆర్‌డీవో సైంటిస్ట్-ఎఫ్ డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణన్ మాట్లాడుతూ హై ఎనర్జీ మెటీరియల్స్‌లో రసాయన సంక్లిష్టతలు గుణాత్మకంగా డిజైన్ చేయడం ద్వారా తక్కువ పరిమాణంలో ఎక్కువ శక్తిని విడుదల చేయగల సామర్థ్యం ఉంటుందని తెలియజేశారు. కంప్యూటర్ మోడలింగ్, సిమ్యులేషన్స్ ద్వారా మెటీరియల్స్ స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చున్నారు. అనంతరం పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేలూరులోని తిరువల్లువర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ రీసెర్చ్ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, హెడ్ కె.దినకరన్, హైదరాబాద్‌లోని ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ కేఎస్ఎన్.రాజు, విశాఖపట్నంలోని ఐపీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ గుప్త చందలూరి, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సూర్యసారథి బోస్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు